www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 14 జులై 2025

నేడు యథావిధిగా పిజిఆర్ఎస్

ఏలూరు : ప్రజా ఫిర్యాదుల పరిష్కారాన్ని మరింత వేగవంతంగా, ప్రజల దృష్టికి మరింత చేరువ చేయడం లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పిజిఆర్ఎస్) సేవలను మండల, డివిజనల్, మున్సిపల్ స్థాయిల్లో కూడా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. జిల్లా స్థాయిలో కలెక్టరేట్ గోదావరి సమావేశం మందిరంలో ఈ నెల 14వ తేదీ సోమవారం యథావిధిగా పిజిఆర్ఎస్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజలు తమ ఫిర్యాదులను సమీప మండల, డివిజనల్, లేదా మున్సిపల్ కార్యాలయాల్లో నేరుగా సమర్పించుకోవచ్చని పేర్కొన్నారు. అలాగే ఇంటి నుంచే ఆన్‌లైన్ ద్వారా ఫిర్యాదు చేసేందుకు ప్రభుత్వం అధికారిక వెబ్‌సైట్ https://meekosam.ap.gov.in ఏర్పాటు చేసిందని తెలిపారు. ఫిర్యాదు నమోదు, ఫిర్యాదుల స్థితి తదితర సమాచారం తెలుసుకోవాలంటే 1100 నెంబర్‌కు కాల్ చేయవచ్చని పేర్కొన్నారు. ఈ వ్యవస్థ వల్ల ప్రజల సమస్యలు తక్షణమే సంబంధిత అధికారులకు చేరి, సమయానుకూలంగా పరిష్కారమవుతాయని కలెక్టర్ పేర్కొన్నారు.

గోదావరి వరద తగ్గుముఖం

ఇంకా ముంపులోనే గుండేటి వాగు కాజ్‌వే

12 గ్రామాలకు మూడు రోజులుగా నిలిచిన రాకపోకలు

భద్రాచలంలో 31.06 అడుగులకు తగ్గిన నీటిమట్టం

పోలవరం : పట్టిసీమ వద్ద తగ్గిన గోదావరి

ప్రజాశక్తి - కుక్కునూరు రూరల్

గత వారం రోజులుగా గోదావరికి పెరుగుతూ వచ్చిన వరద ఉధృతి తగ్గుముఖం పట్టింది. భద్రాచలంలో శనివారం 41.3 అడుగులకు చేరిన గోదావరి నీటిమట్టం ఆదివారం నాటికి 31.06 అడుగులకు తగ్గింది. గోదావరి వరద ఉధృతి తగ్గినా కుక్కునూరు, దాచారం మధ్య గుండేటివాగుపై కాజ్‌వే ఇంకా ముంపులోనే ఉండడంతో అవతల ఉన్న 12 గిరిజన గ్రామాల ప్రజలు, వ్యాపారస్తులు, రైతులు, కుక్కునూరులో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు ప్రతిరోజు కుక్కునూరు రావాల్సి ఉంటుంది. వీరంతా మండల కేంద్రానికి రావాలంటే బస్సు సౌకర్యం లేక చుట్టూ 15 కిలోమీటర్లు తిరిగి ఆటోలను ఆశ్రయించి రావాల్సిన పరిస్థితి. దీంతో ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సంబంధిత అధికారులు వరద ప్రభావిత ప్రాంతమైన గొమ్ముగూడెం గ్రామానికి చెందిన 253 కుటుంబాలను రావికుంట పునరావాస కేంద్రానికి తరలించారు. గోదావరికి వరద ఉధృతి తగ్గడంతో ముంపు మండలాల ప్రజలు, రైతులు ఊపిరి పీల్చుకున్నారు.

స్పిల్‌వే నుంచి 7,41,269 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల

పోలవరం : పోలవరంలో గోదావరి జలాలు ఆదివారం సాయంత్రం నాటికి స్వల్పంగా తగ్గింది. ప్రాజెక్ట్ స్పిల్‌వే నుండి 7,41,269 అదనపు జలాలను అధికారులు దిగువకు విడుదల చేశారు. ప్రాజెక్టు స్పిల్వే ఎగువన 31,420 మీటర్లు, దిగువన 22,700 మీటర్లు, ఎగువ కాఫర్ డ్యాంకి ఎగువన 31,980 మీటర్లు, దిగువ కాఫర్ డ్యాంకి దిగువన 22.200 మీటర్లు, ఎగువ, దిగువ కాపర్ డ్యాంల మధ్య 16.120 మీటర్లు నీటిమట్టం నమోదయ్యింది. స్పిల్వేలోకి వస్తున్న అదనపు జలాలను ఎప్పటికప్పుడు 48 గేట్ల ద్వారా దిగువకు విడుదల చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రాజెక్ట్ దిగువన 10.70 మీటర్లు నమోదయిందని ప్రస్తుతం పోలవరం వద్ద గోదావరి నీటిమట్టం తగ్గిందని సిడబ్ల్యుసి అధికారులు తెలిపారు.

మూడు రోజులుగా ముంపులో ఉన్న కుక్కునూరు - దాచారం మధ్య గుండేటివాగుపై కాజ్‌వే

పునరావాస కేంద్రాల్లో ఆర్‌డిఒ పర్యవేక్షణ

ఏలూరు : కుక్కునూరు, వేలేరుపాడు మండలాలకు చెందిన వరద బాధిత కుటుంబాలకు దాచారంలోని ఆర్అండ్ఆర్ కాలనీలో, తాడువాయి, ములగలంపల్లిలో ఏర్పాటు చేసిన వరద పునరావాస శిబిరాల్లో ఆదివారం సహాయ, పునరావాస కార్యక్రమాలను అధికారులు దగ్గరుండి పరిశీలించారు. జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశాల మేరకు వరద సహాయ పనుల్లో ఎటువంటి ఆటంకం కలగకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఆదివారం ఉదయం కూడా రేపాకగొమ్ము గ్రామంలోని కొన్ని కుటుంబాలను తాడువాయి, ములగలంపల్లిలో ఏర్పాటుచేసిన పునరావాస శిబిరాలకు తరలించే పనులను జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒ ఎంవి.రమణ పర్యవేక్షించారు. దాచారం ఆర్అండ్ఆర్ కాలనీలో ఏర్పాటు చేసిన శిబిరాల్లో ప్రజలకు భోజనం తయారీని ఆర్‌డిఒ పరిశీలించి, ప్రజలకు వడ్డించారు. వర్షాలు, వరదలకు ఇళ్లు దెబ్బతిన్న కుటుంబాలకు టార్పాలిన్లు అందిస్తున్నారు. సహాయ పునరావాస కార్యక్రమాల్లో ఎక్కడా చిన్న పొరపాటు కూడా జరగకుండా ఆర్‌డిఒ పర్యవేక్షిస్తున్నారు. ఆయన వెంట కుక్కునూరు, వేలేరుపాడు తహశీల్దార్లు రమేష్‌కుమార్, జి.సత్యనారాయణ, రెవెన్యూ, పౌర సరఫరాల శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

వేలేరుపాడు రూరల్ : గోదావరి వరద తగ్గుముఖం పట్టడంతో గోదావరి పరివాహక ప్రాంతాలైన రుద్రంకోట, రేపాకగొమ్ము, తాట్కూరు గొమ్ము గ్రామాల్లోని ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. భద్రాచలం వద్ద గోదావరి ఆదివారం సాయంత్రానికి 31.06 అడుగులతో నిలకడగా ఉందని అధికారులు తెలియజేశారు. ప్రస్తుతానికి గోదావరి ఇబ్బందులు లేకపోయినా ఆగస్టు, సెప్టెంబర్‌లో చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ముంపు ప్రాంత ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గోదావరి తగ్గుముఖం పట్టినా గానీ బోళ్లపల్లి వద్ద ఉన్న ఎద్దువాగు కాజ్‌వే మునిగి ఉండడంతో ఇంకా రెండు, మూడు రోజుల వరకూ కోయిదా, కట్కూరు, సిద్ధారం తదితర 18 గ్రామాల్లోని ప్రజలు రహదారుల సౌకర్యం లేక నానా అవస్థలు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. మున్ముందు వరదలు పెరిగితే పిల్లాపాపలతో. తినడానికి తిండి లేక సరైన వసతి లేక ఎన్ని. ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

'తల్లికి వందనం' కొందరికే..!

రెండో జాబితాలోనూ అర్హులకు చుక్కెదురు

గ్రీవెన్స్‌లో సమస్య పరిష్కారమైనా పాత కారణాలు చూపిస్తూ నిలుపుదల

లబోదిబోమంటున్న అర్హులైన విద్యార్థులు, తల్లిదండ్రులు

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో దాదాపు 50 వేల మందికి అందలేదని అంచనా

తల్లికి వందనం లెక్కలపై గోప్యత పాటిస్తున్న అధికారులు

తమకు తెలియదంటూ ఉత్సవ విగ్రహంలా మారిన విద్యాశాఖ

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ప్రభుత్వం అత్యంత గొప్పగా చెబుతున్న 'తల్లికి వందనం' కొందరికి మాత్రమే అందడం చర్చనీయాంశంగా మారింది. గ్రీవెన్స్‌లో ఇచ్చిన ఫిర్యాదులపై అంతా బాగా ఉందని చెప్పినప్పటికీ అర్హుల జాబితాలో మాత్రం పేరు రాకపోవడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర నిరాశకు గురవుతున్న పరిస్థితి నెలకొంది. అర్హత ఉన్నా తల్లికి వందనం అందని విద్యార్థులు ఏలూరు, పశ్చిమగోదావరి రెండు జిల్లాల్లో దాదాపు 50 వేల మంది వరకూ ఉన్నట్లు తెలుస్తోంది. ప్రజల నుంచి వ్యతిరేకత రాకుండా ఉండేందుకు తల్లికి వందనం లెక్కలు ప్రభుత్వం గోప్యంగా ఉంచుతున్నట్లు కనిపిస్తోంది. ఒకటో తరగతి నుంచి ఇంటర్ వరకూ చదివే విద్యార్థులందరికీ తల్లికి వందనం అమలు చేస్తామని కూటమి ప్రభుత్వం చెప్పింది. జూన్ 12వ తేదీన తల్లికివందనం సొమ్ములు ప్రభుత్వం విడుదల చేసింది. పశ్చిమగోదావరి జిల్లాలో 1,76,574 మంది విద్యార్థులు అర్హత సాధించినట్లు తేల్చారు. ఇంకా 41,703 మంది విద్యార్థులను అనర్హుల జాబితాలో చేర్చారు. ఏలూరు జిల్లాలో 2,15,082 మంది విద్యార్థులను అర్హులుగా తేల్చగా, దాదాపు 60 వేల మంది విద్యార్థులు అనర్హుల జాబితాలో ఉండిపోయారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. దీంతో తల్లికి వందనం రాని విద్యార్థులంతా గ్రీవెన్స్‌లో సంబంధిత పత్రాలు అందించాలని ప్రభుత్వం పేర్కొంది. జూన్ 20వ తేదీ వరకూ గడువు ఇచ్చింది. 300 యూనిట్లు దాటినట్లు పేర్కొనడం, భూములు లేకపోయినా ఉన్నట్లు చూపించడం, కారులేకపోయిన ఉన్నట్లు చూపడంతో చాలా మంది విద్యార్థులకు తల్లికి వందనం రాలేదు. ఇలాంటి వారంతా రవాణా, విద్యుత్, రెవెన్యూ శాఖల నుంచి పత్రాలను తీసుకుని సచివాలయాల్లో అందించారు. పత్రాలు అందించిన తర్వాత ప్రభుత్వం పేర్కొన్న ఎనిమిది అంశాలకు సంబంధించి సంతృప్తి (శాటిస్‌ఫైడ్) చెందినట్లు ఆన్‌లైన్‌లో చూపించారు. కొత్తగా ఒకటో తరగతిలో, ఇంటర్ మొదటి ఏడాదిలో చేరిన వారికి సంబంధించిన వారితో కలిపి రెండో జాబితాను జులై పదో తేదీన ప్రభుత్వం విడుదల చేసింది. రెండో జాబితాలోనూ చాలా మంది పేర్లు లేకుండా పోయాయి. ఆన్‌లైన్‌లో సంతృప్తి చెందినట్లు చూపించిన పేర్లు మాత్రం జాబితాలో కనిపించడం లేదు. దీంతో బాధిత తల్లిదండ్రులంతా లబోదిబోమంటున్నారు. అర్హత ఉండి తల్లికి వందనం అందని విద్యార్థులు 50 వేలకుపైగా ఉన్నట్లు తెలుస్తోంది. వీరికి మళ్లీ అవకాశం కల్పిస్తారా.. ఈ ఏడాదికి ఎగనామం పెట్టేస్తారా అన్న చర్చ జనాల్లో సాగుతోంది. తల్లికి వందనం కొందరికే అందడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

లెక్కలు చెప్పకుండా గోప్యత..

తల్లికి వందనం అమలుకు సంబంధించి ప్రభుత్వ నుంచి సరైన సమాచారం లేకుండా పోయింది. జిల్లాలో ఎంత మంది విద్యార్థులకు తల్లికి వందనం అందించారు. ఎన్ని రూ.కోట్లు జిల్లాకు అందాయో కూడా లెక్కలు చెప్పడం లేదు. గత వైసిపి ప్రభుత్వం జిల్లాకు సంబంధించి వివరాలతో కూడిన ప్రకటనను విద్యాశాఖ విడుదల చేసింది. ఇప్పుడు అటువంటి పరిస్థితి లేకుండా పోయింది. మెగా పేరెంట్స్ సమావేశాల్లో సైతం ఏ స్కూల్లోనూ తల్లికి వందనం జాబితాలు బయట పెట్టని పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం ఇదంతా కావాలనే చేస్తోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తల్లికి వందనం జిల్లాలో ఎంతమందికి వచ్చింది. ఇంకా అనర్హుల జాబితాలో ఎంతమంది ఉన్నారో వంటి లెక్కలు విద్యాశాఖ విడుదల చేయాలని అంతా కోరుతున్నారు. దీనిపై రెండు జిల్లాల ఉన్నతాధికారులు సైతం సరిగ్గా పట్టించుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఉధృతంగా వశిష్ట గోదావరి

కోడేరు పుష్కర ఘాట్ వద్ద మూడు అడుగులకు చేరిన నీరు - లంకగ్రామాల ప్రజల ఆందోళన

ఆచంట: లంకగ్రామాలకు పడవలపై వెళ్తున్న రైతులు

ప్రజాశక్తి - ఆచంట

వశిష్ట గోదావరికి వరద ఉధృతి పెరుగుతోంది. దీంతో లంక గ్రామాల ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. కోడేరు పుష్కర ఘాట్ వద్ద ఆదివారం సాయంత్రానికి మూడు అడుగులకు వరద నీరు చేరింది. దీంతో అధికారులు అప్రమత్తమయ్యారు. వరద గంట గంటకూ పెరుగుతున్న నేపథ్యంలో లంక గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ప్రస్తుత వారికి బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. కోడేరు వద్ద క్రమక్రమంగా పెరుగుతున్న నేపథ్యంలో లంక గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గోదావరి నదీ తీర ప్రాంతాల ప్రజల్లో కలవరం మొదలైంది. వరద నీరు నెమ్మది నెమ్మదిగా పల్లపులంక ప్రాంతాల్లోకి చేరుతోంది. భీమలాపురం ఏటిగట్టు దిగువ ఉన్న నివాస ప్రాంతాల వారిని వరద ఏక్షణాన్నైనా చుట్టుముట్టే ప్రమాదం ఉండడంతో వారు ఆందోళన చెందుతున్నారు. లంక గ్రామాల్లోకి వరద నీరు ప్రవేశిస్తే రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది. ప్రస్తుతం లంక భూముల్లో తమలపాకు, పచ్చిమిర్చి, అరటి, కొబ్బరి, మునగ, జామ, ఆకుకూరలు పండిస్తున్నారు. వరద మరింత పెరుగుతుండడంతో రైతులకు కంటిమీద కొనుకు ఉండడం లేదు. ఆచంట మండలం, కోడేరు, కరుగోరుమిల్లి, భీమలాపురం, అయోధ్యలంక, పచ్చల్లంక మర్రిమూల, రాయిలంక, పెదమల్లంలంక గ్రామాల ప్రజలు బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్నారు. రైతులు లంక గ్రామాల నుంచి పడవల మీద కొబ్బరికాయలు రవాణా చేస్తూ సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. పశువులను ఏటిగట్టుకు తరలిస్తున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో తోటకూర, గోంగూర, పాలకూర, కొత్తిమీర, బెండ, పచ్చిమిర్చి, వంగ తోటలోకి నీరు చేరుతోందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సోమవారం నాటికి గోదావరి మరింత పెరిగే అవకాశం ఉందని లంక గ్రామాల ప్రజల అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ జి.కనకరాజు హెచ్చరికలు జారీ చేశారు. లంక గ్రామాల్లో రెవెన్యూ, వైద్య సిబ్బంది, ఆర్‌డబ్ల్యూఎస్, సిబ్బందిని అప్రమత్తం చేశారు. కోడేరు వద్ద రెండు ఇంజిన్ పడవలను అందుబాటులో ఉంచినట్లు తహశీల్దార్ అధికారులు తెలిపారు.

కనకాయలంక కాజ్‌వే పైకి చేరిన వరద నీరు

కనకాయలంక కాజ్‌వేపై వరద నీటి ప్రవాహాన్ని పరిశీలిస్తున్న ఆర్‌డిఒ

యలమంచిలి : గోదావరి వరద ఆదివారం ఉధృతంగా ప్రవహిస్తోంది. గంట గంటకూ నీటిమట్టం పెరగడంతో మండలంలోని కనకాయలంక కాజ్‌వే పైకి వరద నీరు చేరింది. వరద మరింత పెరిగితే కాజ్‌వేపై రాకపోకలకు ఇబ్బంది పడే పరిస్థితి ఏర్పడుతుందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో నరసాపురం ఆర్‌డిఒ దాసిరాజు, తహశీల్దార్ గ్రంధి పవన్ కుమార్ కనకాయలంక, పెదలంక గ్రామాల్లో పర్యటించి వరద ప్రవాహాన్ని పరిశీలించి అధికారులతో సమీక్షించారు ఈ సందర్భంగా ఆర్‌డిఒ దాసి రాజు మాట్లాడుతూ కనకాయలంక కాజ్ వే పైకి వరద నీరు చేరినా ప్రజల రాకపోకలకు ఎటువంటి ఇబ్బంది లేదని, వరద తీవ్రత సాయంత్రానికి తగ్గుముఖం పట్టే అవకాశం ఉందని తెలిపారు. ఒకవేళ వరద పెరిగితే ప్రజల రాకపోకలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా బోట్లు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట విఆర్ఒలు శ్రీనివాసరావు, గ్రామ నాయకులు మస్కుడి రాంబాబు, ఆకుమర్తి శ్రీనివాస్ పాల్గొన్నారు.

చెట్టును ఢీకొన్న పల్లె వెలుగు బస్సు

వెలగలపల్లి వద్ద ఘటన - 12 మందికి గాయాలు

గాయపడిన వృద్ధుడు ఏసు

ప్రజాశక్తి - చింతలపూడి

అదుపుతప్పి పల్లెవెలుగు బస్సు చెట్టును ఢీకొన్న సంఘటన మండలంలోని వెలగలపల్లి వద్ద ఆదివారం చోటు చేసుకుంది. ఈ ఘటనలో పది ప్రయాణికులు గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తెలంగాణ రాష్ట్రం సత్తుపల్లి నుంచి ఏలూరు వస్తున్న పల్లెవెలుగు బస్సు చింతలపూడి మండలం వెలగలపల్లి చింతలపూడి మండలం వెలగలపల్లి ఊర చెరువు వద్ద రోడ్డుపై గుంతను తప్పించబోయి మామిడి చెట్టును ఢీకొంది. దీంతో బస్సులో ప్రయాణిస్తున్న ప్రయాణికులు భయందోళనకు గురయ్యారు. డ్రైవర్ అతివేగంగా నడపడం వల్లే గుంతలో పడి బస్సు స్టీరింగ్ వదిలేశాడని, దీంతో బస్సు చెట్టుకు ఢీకొట్టిందని ప్రయాణికులు తెలిపారు. బస్సులో 30 మంది ప్రయాణించగా వారిలో ఆరుగురికి స్వల్పగాయాలు కాగా, నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. అందరినీ 108 వాహనంలో చింతలపూడి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన నలుగురు ప్రయాణికులు పెద్ద పుల్లయ్య, వరలక్ష్మి, ఏసు, మరో మహిళను మెరుగైన వైద్యం నిమిత్తం ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే ఎటువంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో అంతా ఊపిరిపిల్చుకున్నారు.

చెట్టును ఢీకొన్న బస్సు

రానున్న కాలంలో ఆటోమేటిక్ సిగ్నల్ వ్యవస్థ

ఏలూరు నగరపాలక సంస్థ కమిషనర్ భానుప్రతాప్

ఇంటర్వ్యూ

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

రానున్న సంవత్సర కాలంలో ఆటోమేటిక్ సిగ్నల్ వ్యవస్థను తీసుకొస్తున్నామని ఏలూరు నగరపాలక సంస్థ కమిషనర్ అన్నాప్రగడ భానుప్రతాప్ తెలిపారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో రోడ్లు, డ్రెయిన్లు అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తిఓ మాట్లాడారు.

ప్రశ్న : మున్సిపల్ కమిషనర్‌గా ఉద్యోగం చేపట్టిన నాటి నుంచి మీ ప్రయాణం ఎలా జరిగింది?

కమిషనర్ : ఏలూరు మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టి ఆగస్టు 24కి సంవత్సరం కావస్తుంది. ఈ సంవత్సర కాలంలో ప్రభుత్వ ఆదేశాల ప్రకారం అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాం. నాలుగు అన్నా క్యాంటీన్లు ఏర్పాటు చేసి పేదలందరికీ భోజనం అందిస్తున్నాం. ఆర్థిక సంఘం నిధులతో వివిధ ప్రాంతాల్లో రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించాం. పార్కులను అభివృద్ధి చేశాం. ఎంఎల్ఎ, మేయర్ సహకారంతో ఈ ఏడాది కాలంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు పూర్తి చేశాను.

ప్రశ్న : నగరపాలక సంస్థ పరిధిలో ప్రస్తుతం మీరు చేస్తున్న అభివృద్ధి పనులు ఏమిటి?

కమిషనర్ : నగరపాలక సంస్థ పరిధిలో ప్రస్తుతం 15వ ఆర్థిక సంఘం నిధులతో వివిధ ప్రాంతాల్లో రోడ్లు, డ్రెయిన్లు అభివృద్ధి చేస్తున్నాం. ఇంకా అన్ని డిపార్ట్‌మెంట్ల సహకారంతో టౌన్‌లో ముఖ్యమైన అభివృద్ధి పనులన్నీ చేస్తున్నాం.

ప్రశ్న : డ్రెయినేజీలు, రోడ్లను మెరుగు పరచడంలో మీరు తీసుకుంటున్న చర్యలు ఏమిటి?

కమిషనర్ : ఇప్పటికే సాధారణ నిధులు, వివిధ గ్రాంట్లతో ముఖ్యమైన అభివృద్ధి పనులు చేస్తున్నాం. రానున్న రోజుల్లో ప్రభుత్వం ఎస్‌సి సబ్ ప్లాన్ కింద పెద్ద మొత్తంలో నిధులు కేటాయించే అవకాశం ఉంది. వాటితో ఎస్‌సి కాలనీలన్నింట్లో రోడ్లు, నీటి సరఫరా చేస్తాం.

ప్రశ్న : నగరపాలక సంస్థ పరిధిలో ప్రజల కోసం హెల్ప్‌లైన్ లేదా గ్రీవెన్స్ సెంట్రల్ ఏమైనా ఏర్పాటు చేశారా?

కమిషనర్ : ప్రజల కోసం 24/7 జిల్లా కలెక్టర్ వారి ఆదేశాలను అనుసరిస్తూ హెల్ప్ లైన్ ఏర్పాటు చేశాం. ఎటువంటి సమయంలో అయినా హెల్ప్ లైన్ నెంబర్‌కు కాల్ చేస్తే ప్రజల అవసరం తీరుస్తున్నాం.

ప్రశ్న : నగరపాలక సంస్థ పరిధిలో మెరుగైన పారిశుధ్యం కోసం ఎటువంటి చర్యలు చేపట్టారు?

కమిషనర్ : ఇప్పటికే మెరుగైన పారిశుధ్యం కోసం డంపర్ బిన్ కొనుగోలు చేశాం. అదేవిధంగా 25 క్లాప్ ఆటోలు ఏర్పాటు చేశాం. నగరంలో ఎక్కడా కూడా చెత్త నిల్వ ఉండకుండా చర్యలు తీసుకుంటున్నాం. ఐవిఆర్ఎస్ కాల్స్‌లో కూడా కార్పొరేషన్‌కు మంచిర్యాంకు లభిస్తుంది. ఈ విధంగా ప్రజలకు సేవ చేస్తున్నాం.

ప్రశ్న : నగరపాలక సంస్థ పరిధిలో ట్రాఫిక్ సమస్యలను తగ్గించడానికి ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?

కమిషనర్ : ప్రత్యేకించి ఎస్‌పి సహకారంతో ఈ ట్రాఫిక్ సమస్యను పరిష్కరించడానికి, ఆటోమేటిక్ సిగ్నల్ వ్యవస్థను తీసుకొస్తున్నాం. వాటి వల్ల నగరంలో వాహనాలు ఆగకుండా సిగ్నల్స్ గుర్తించి వెళ్లడానికి వీలుగా ఉంటుంది. వీటిని రానున్న సంవత్సరంలో ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తాం.

ప్రశ్న : నగరంలో పార్కింగ్ సమస్యలపై ఏమైనా చర్యలు తీసుకున్నారా?

కమిషనర్ : పార్కింగ్ సమస్యలపై ప్రస్తుతానికి లోతుగా పరిశీలించాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతానికి నగరంలో ఎక్కడ అంత సమస్యాత్మకం గా ఉన్నట్లు కనిపించలేదు. పోలీస్ డిపార్ట్‌మెంట్ సహకారంతో పార్కింగ్ సమస్యను కూడా పరిష్కరిస్తాం.

ప్రశ్న : నగరంలో ప్లాస్టిక్ నిషేధంపై ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?

కమిషనర్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతి మూడో శనివారం స్వచ్ఛాంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమం కింద 120 మైక్రాన్స్ కంటే తక్కువ ఉన్న ప్లాస్టిక్ నిషేధించడానికి చర్యలు తీసుకుంటుంది. అదేవిధంగా ఆ ప్లాస్టిక్‌ను నిషేధించాలని టౌన్‌లో ఉన్న షాపులన్నిటికీ అవేర్నెస్ ప్రోగ్రాంలో అవగాహన కల్పిస్తున్నాం. అప్పటికీ వారు నియమాలు పాటించకపోతే పెనాల్టీ వేస్తున్నాం.

ప్రశ్న : నగరంలో ఉన్న చాలా హాస్పిటల్స్‌కు పార్కింగ్ ఉండట్లేదు, వాటిపై ఏమైనా చర్యలు తీసుకున్నారా, నోటీసులు ఏమైనా ఇచ్చారా?

కమిషనర్ : పరిశీలిస్తున్నాం.

చిల్డ్రన్ ట్రాఫిక్ పార్క్ ప్రారంభం

చిల్డ్రన్ ట్రాఫిక్ పార్క్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ఏలూరు పోలీస్ ప్రధాన కార్యాలయం వద్ద ఉన్న పార్క్‌లో అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ వారి ద్వారా నూతనంగా నిర్మించిన చిల్డ్రన్ ట్రాఫిక్ పార్క్‌ను ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్, ఎస్‌పి కె.ప్రతాప్‌శివకిషోర్, జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి, ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి, అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఛైర్మన్ పెద్దబోయిన శివప్రసాద్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్‌పి కె.ప్రతాప్‌శివకిషోర్ మాట్లాడుతూ పిల్లలకు ట్రాఫిక్ పరంగా అవగాహన కల్పించేందుకు ట్రాఫిక్ పోలీస్ విభాగం ప్రత్యేకంగా సిద్ధం చేసిన ఈ పార్క్ ఒక శిక్షణా కేంద్రంగా మారుతుందన్నారు. ఇటువంటి పార్కుల వల్ల పిల్లలు ట్రాఫిక్ నియమ, నిబంధనల గురించి తెలుసుకుని వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తారన్నారు. వర్షాలు కురిసినప్పుడు రోడ్ల స్థితిగతుల గురించి, ఏదైనా గోతుల వల్ల గాని ప్రమాదాలు జరగకుండా ఉండేలాగా ఈ పార్కు నిర్మించినట్లు తెలిపారు. ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ మాట్లాడుతూ రూ.84 లక్షల వ్యయంతో క్రాస్ రోడ్ ట్రాఫిక్ పార్క్ నిర్మించినట్లు తెలిపారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా రోడ్డు ప్రమాదాల నివారణ కోసం ఎస్‌పి ఆధ్వర్యంలో ఎన్నో వినూత్న కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎంఎల్ఎ బడేటి చంటి మాట్లాడుతూ క్రాస్ రోడ్ ట్రాఫిక్ పార్క్ ద్వారా పిల్లలు చిన్న వయసులోనే ట్రాఫిక్ చట్టాలు, బాధ్యతలు అర్థం చేసుకుంటారన్నారు. ఇది భవిష్యత్తులో మెరుగైన పౌరులుగా ఎదిగేందుకు దోహదపడుతుందన్నారు. జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం పౌరభద్రత, పిల్లల భవిష్యత్తు పరిరక్షణపై ఎంతో ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ఈ ట్రాఫిక్ పార్క్ విద్యాభద్రత రంగాల్లో సమన్వయానికి చక్కటి ఉదాహరణ అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏలూరు అర్బన్ డెవలప్‌మెంట్ ఛైర్మన్ పెద్దిబోయిన శివప్రసాద్, ఏలూరు ఛైర్‌పర్సన్ నూర్జహాన్ పెదబాబు, ఎస్ఎంఆర్ పెదబాబు, దాసరి ఆంజనేయులు, ఘంట మురళి, ఏలూరు డిఎస్‌పి శిరిడి శ్రావణ్‌కుమార్, ఏలూరు త్రీ టౌన్ ఇన్‌స్పెక్టర్ కోటేశ్వరరావు, ఏలూరు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఎస్.లక్ష్మణ్‌రావు, ఎఆర్ డిఎస్‌పి చంద్రశేఖర్, ప్రజా ప్రతినిధులు, పోలీసు అధికారులు, చిన్నారులు, తల్లి దండ్రులు పాల్గొన్నారు.

ఆర్‌జియుకెటి రెండో దశ ఎంపిక జాబితా విడుదల

నూజివీడు టౌన్ : ఆర్‌జియుకెటి రెండో దశ ఎంపిక జాబితా విడుదలైంది. ఈ జాబితాలో మొదటి దశలో మిగిలిన సీట్లకు, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ కోటాలో 20 సీట్లు, వికలాంగులకు 179 సీట్లు, సాయుధ దళాల కోటా కింద 80 సీట్లు కలిపి మొత్తం 907 సీట్లకు విద్యార్థులను ఎంపిక చేశారు. ఆర్‌కె వ్యాలీకి ఎంపికైన విద్యార్థులు ఆర్‌కె వ్యాలీ క్యాంపస్‌లో ఈ నెల 17వ తేదీన రిపోర్ట్ చేయాల్సి ఉంటుంది. అలాగే నూజివీడు, శ్రీకాకుళం, ఒంగోలు క్యాంపస్‌లకు ఎంపికైన విద్యార్థులు అదే రోజు నూజివీడు క్యాంపస్‌లో హాజరై ధ్రువపత్రాల పరిశీలన, ప్రవేశ ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉంటుంది. తరగతులు ఈ నెల 14వ తేదీ నుంచి ప్రారంభమవుతున్నాయని, విద్యార్థులు తమ లగేజ్‌తో వచ్చి రిపోర్ట్ చేసి యథావిధిగా తరగతులకు హాజరయ్యేలా సిద్ధపడి రావాలని ఆర్‌జియుకెటి రిజిస్ట్రార్, ప్రవేశాల కన్వీనర్ ఆచార్య సంద్ర అమరేంద్ర కుమార్ తెలిపారు. మొదటి దశ తర్వాత మిగిలిన ఖాళీలను దృష్టిలో ఉంచుకుని అంతర్గత బదిలీలు నిర్వహించామని తెలిపారు. ఈ ప్రక్రియ ద్వారా మొత్తం 384 మంది విద్యార్థులు లాభం పొందారని తెలిపారు. ఇప్పటివరకు మొత్తం 4,340 మంది విద్యార్థుల ఎంపిక పూర్తయిందని, ఇంకా 60 సీట్లు, అంటే ఎన్‌సిసి కోటాలో 40, క్రీడా కోటాలో 20 సీట్లు మిగిలి ఉన్నాయని, ఈ సీట్లకు సంబంధించిన ఎంపిక ఫలితాలను తదుపరి వారం విడుదల చేయనున్నట్లు తెలిపారు.

జాతీయ రహదారుల్లో సమస్యల పరిష్కారానికి కృషి

ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్

ప్రజాశక్తి - దెందులూరు

జాతీయ రహదారుల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తున్నట్లు ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ తెలిపారు. దెందులూరు మండలంలోని కొత్తగూడెం శివారు సింగవరం యాదవ్ నగర్‌లో ఎంపీ నిధులు రూ.25 లక్షలతో చేపడుతున్న మల్టీపర్పస్ కమ్యూనిటీ హాలు నూతన భవన నిర్మాణానికి ఆయన ఆదివారం సాయంత్రం శంకుస్థాపన చేశారు. అనంతరం అక్కడే ఉన్న గంగాదేవి అమ్మవారి ఆలయం సందర్శించి, అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. శంకుస్థాపన అనంతరం జరిగిన సభలో ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ మాట్లాడుతూ ముఖ్యంగా జాతీయ రహదారుల్లో ప్రమాదాల నివారణకు అవసరమైన ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు, సర్వీస్ రోడ్ల నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేయాలని కేంద్ర మంత్రులను ఇప్పటికే పలుమార్లు కలిసి విజ్ఞప్తి చేసినట్లు చెప్పారు. రూ.వెయ్యి కోట్లు అంచనా వ్యయంతో చేపట్టే 12 రైల్వే ఓవర్ బ్రిడ్జిల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం ఇటీవల పరిపాలన ఆమోదం తెలిపిందని ఎంపీ స్పష్టం చేశారు. సింగవరం యాదవ్ నగర్ సమీపంలో జాతీయ రహదారికి ఇరువైపులా రాకపోకలు సాగించడానికి వీలుగా ఆర్‌యుపి నిర్మాణానికి అవసరమైన నిధులను కేంద్ర ప్రభుత్వం నుంచి రాబడతానని తెలిపారు.

వంతెన నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలి

అధికారులకు ఎంపీ మహేష్ కుమార్ ఆదేశం

ప్రజాశక్తి - భీమడోలు (ఉంగుటూరు)

ప్రజలు పడుతున్న ఇబ్బందుల దృష్ట్యా వంతెన నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ ఆదేశించారు. భీమడోలు మండలం గుండుగొలను వద్ద గోదావరి కాలువపై అసంపూర్తిగా నిలిచిన వంతెన నిర్మాణ పనులను నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ఆదివారం సాయంత్రం ఎంపీ పుట్టా మహేష్ కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా వంతెన నిర్మాణ పనులు నిలిచిపోవడానికి గల కారణాలను నేషనల్ హైవే అధికారులను అడిగి తెలుసుకున్నారు. అక్కడి నుంచే కాంట్రాక్టర్‌కు ఫోన్ చేసి తదుపరి దశకు చేరుకున్న వంతెన నిర్మాణ పనులు గడువులోపు పూర్తి చేయాలని సూచించారు. బిల్లులు పెండింగ్ ఉంటే మంజూరుకు తాను బాధ్యత తీసుకుంటానని కాంట్రాక్టర్‌కు ఎంపీ భరోసా కల్పించారు. అనంతరం స్థానిక ప్రజలతో మాట్లాడి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

నూతన బోరు ఏర్పాటు పరిశీలిస్తున్న అధికారులు

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి - ముసునూరు

మండలంలోని రమణక్కపేట గ్రామంలోని దళితవాడలో తాగునీటి సరఫరా కోసం నూతన బోరు ఏర్పాటు చేసినట్లు ఎంపిడిఒ బసవరాజు అచ్యుత సత్యనారాయణ తెలిపారు. దళితవాడలో తాగునీరు సరఫరా అవ్వక ప్రజలు ఇబ్బంది పడుతుండడంపై దళితవాడలో దాహం కేకలు శీర్షికతో ప్రజాశక్తిలో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. తాగునీటికి ఇబ్బంది లేకుండా సమస్యను పరిష్కరిస్తున్నట్లు ఎంపిడిఒ తెలిపారు.

'ప్రజా సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి'

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

ప్రజా సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని టిడిపి పట్టణ అధ్యక్షులు కొండ్రెడ్డి కిషోర్ అన్నారు. టిడిపి జంగారెడ్డిగూడెం పట్టణ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన వర్క్‌షాపులో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేస్తుందన్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ నంబూరి రామచంద్రరాజు, బిసి కార్పొరేషన్ చిట్టిబోయిన రామలింగేశ్వరరావు, సీనియర్ నాయకులు బొబ్బర రాజ్ పాల్, చెరుకూరి శ్రీధర్, గుమ్మడి ప్రసాద్, కోటగిరి ప్రమీల, కంపా రాజేంద్ర, చేను ప్రసాద్, గెడా సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించాలి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

స్కూల్ ఎడ్యుకేషన్ కమిషనర్ కార్యాలయ అధికారుల అలసత్వం వల్లే ఉపాధ్యాయులకు జీతాలు ఆలస్యమవుతున్నాయని ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తాళ్లూరి రామారావు, బి.రెడ్డిదొర ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉపాధ్యాయుల బదిలీలు జరిగి దాదాపు నెలరోజులు కావస్తున్నప్పటికీ కమిషనర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ అధికారులు కేడర్ స్ట్రెంత్ నిర్ధారించి పొజిషన్ ఐడిలు కేటాయించడంలో అలసత్వం వహించడం వల్ల బదిలీ పొందిన ఉపాధ్యాయులు ఇంతవరకూ జూన్ నెల జీతాలు పొందలేకపోయారని తెలిపారు. చేసిన పనిని సరిగా చేయలేదని, మళ్లీ తిరిగి చేయాలని, లేకపోతే కమిషనర్ కార్యాలయం నుంచి ఫోన్ వస్తుందని ఉపాధ్యాయులను బెదిరించడం సరైన విధానం కాదని పేర్కొన్నారు. ఉపాధ్యాయులను ప్రతి పనికి ఒత్తిడి చేయటం సరి కాదని తెలిపారు. ఉపాధ్యాయులకు బోధనేతర పనులు అప్పగించటం, రకరకాల ట్రైనింగ్ వల్ల బోధన సమయం హరించుకుపోతుందని, ట్రైనింగ్‌లను కేవలం ఒక్క రోజు మాత్రమే ఇవ్వాలని, ఇప్పటికైనా అధికారులు త్వరగా జీతాలు చెల్లించాలని, లేకపోతే ప్రత్యక్ష కార్యాచరణకు దిగుతామని పేర్కొన్నారు.

నేరాలు - ఘోరాలు

పాముకాటుకు మహిళా కూలీ మృతి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

పొలం పనులకు వెళ్లిన మహిళా కూలీ పాముకాటుకు గురై మృతి చెందింది. ఈ ఘటన చింతలపూడి మండలం వెంకటాద్రిగూడెం గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. వివరాల ప్రకారం... చింతలపూడి మండలం వెంకటాద్రిగూడెం గ్రామానికి చెందిన బొడ్డు వెంకాయమ్మ (60) ఆదివారం పొలం పనుల నిమిత్తం పొలానికి వెళ్లింది. అక్కడ పాము కాటుకు గురవ్వగా వెంటనే ఆమెను ఏలూరు సర్వజన ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం సర్వజన ఆసుపత్రిలోని మార్చురీలో భద్రపరిచారు.

లారీ ఢీకొని రెండు గేదెలు మృతి

ఇంటి గోడ ధ్వంసం

ప్రజాశక్తి - కుక్కునూరు

బోల్తా పడిన లారీ

మండలంలోని అల్లి గూడెంలో గ్యాస్ సిలిండర్లతో వెళ్తున్న ఓ లారీ అదుపు తప్పి రోడ్డుపై ఉన్న గేదెలను ఢీకొని ఓ ఇంట్లోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో రెండు గేదెలు మృతిచెందగా, ఇంటి ప్రహరీ గోడతో పాటు రేకుల షెడ్డు పూర్తిగా ధ్వంసమైంది. స్థానికులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు.

నలుగురిపై కేసు

ప్రజాశక్తి - టి.నరసాపురం

ఇద్దరు వ్యక్తులను కొట్టి గాయపరిచిన సంఘటనలో నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ ఎం.రాజు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని బొర్రంపాలెం గ్రామానికి చెందిన మంతెన నరసింహారావుకు కలపర్తి రామకృష్ణకు కొంత కాలంగా భూమి తగాదా నడుస్తుంది. ఈ నేపథ్యంలో ఈ నెల తొమ్మిదో తేదీన కలపర్తి రామకృష్ణ పొలానికి మెస్ వేసి ట్రాక్టర్‌తో దుక్కి దున్నుతుండగా మంతెన నరసింహారావు, మంతెన రామ్మూర్తి వెళ్లి డ్రైవర్‌ను దుక్కి ఎందుకు దువ్వుతున్నావు అని అడిగారు. కలపర్తి రామకృష్ణ, ట్రాక్టర్ ఓనర్ కర్రె జక్రయ్య మరో ఇద్దరు వచ్చి నరసింహారావును, రామ్మూర్తిని కొట్టి గాయపరిచడంతో కుటుంబ సభ్యులు చింతలపూడి ప్రభుత్వం ఆసుపత్రిలో చేర్చారు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

మండలంలోని చొప్పరామన్నగూడెం గ్రామ శివారులో పేకాట స్థావరంపై సిఐ బాల సురేష్ ఆధ్వర్యంలో కొయ్యలగూడెం ఎస్ఐ చంద్రశేఖర్, వారి సిబ్బంది ఆదివారం దాడి చేశారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.42,800 నగదు, ఐదు మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు.

బెల్లపు ఊట ధ్వంసం

కుక్కునూరు : మండలంలోని సీతారామనగరం గ్రామ శివారులో నాటుసారా తయారీ స్థావరంపై కుక్కునూరు సిఐ ఎం.రమేష్‌బాబు నేతృత్వంలోని పోలీసు బృందం ఆదివారం దాడి చేసింది. ఈ దాడిలో సుమారు వెయ్యి లీటర్ల బెల్లపు ఊటతో పాటు సారా తయారీకి ఉపయోగించే బట్టీలను పోలీసులు ధ్వంసం చేశారు. ఈ సంఘటనపై విచారణ జరిపి, తయారీదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని సిఐ రమేష్ బాబు తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

గుంతల రహిత రోడ్లే లక్ష్యంగా అభివృద్ధి

ప్రజాశక్తి - కామవరపుకోట

గుంతలు లేని రోడ్లే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం రూ.866 కోట్లతో రహదారుల అభివృద్ధి చేపట్టిందని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ తెలిపారు. కామవరపుకోట, ఉప్పలపాడులో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని ఎంఎల్‌ఎ సొంగా రోషన్‌కుమార్‌తో కలిసి ఆదివారం రాత్రి ఎంపీ పుట్టా మహేష్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ సొంగా రోషన్ కుమార్, నాయకులు ప్రజా ప్రతినిధులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ఏడాది అధికారంలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాల వివరాలతో కూడిన కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకొని వాటి పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ముసునూరులో...

ముసునూరు : మండల కేంద్రమైన ముసునూరు గ్రామంలోని దళితవాడలో ఆదివారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు యువత నియోజకవర్గ కార్యదర్శి కొండేటి బాబు మాట్లాడారు. అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా అనే అని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ గ్రామ అధ్యక్షులు గాడ్రపాటి నరసింహారావు, టిడిపి నాయకులు నక్క యోహాన్, తదితరులు పాల్గొన్నారు.

కోట కలిదిండిలో...

కలిదిండి : స్థానిక కోట కలిదిండిలో ఆదివారం నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో రాష్ట్ర నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ లంకా రత్నారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి రాష్ట్రంలో ఏడాది పాలనలో జరిగిన సంక్షేమ పథకాలు అమలు, అభివృద్ధి పనులను వివరించారు. 223 బూత్ కన్వీనర్ పులి వెంకటేశ్వరరావు, కో కన్వీనర్ పోసిన వెంకటేశ్వరరావు, ఎండి ఫారుక్ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

ప్రజాశక్తి - టి.నరసాపురం

ప్రతిఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలని రాణా వెల్ఫేర్ సొసైటీ జిల్లా అధ్యక్షులు షేక్ జాకీర్ హుస్సేన్ తెలిపారు. మండలంలోని బండివారిగూడెం గ్రామంలో మేడిద సుబ్బయ్య ట్రస్టు ఆధ్వర్యంలో నేనున్నాను గ్రూపు అధ్యక్షులు డాక్టర్ మేడిద వెంకటేశ్వరరావు జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని రాణావెల్ఫేర్ సొసైటీ సభ్యులు ఆదివారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జాకీర్ హుస్సేన్ మాట్లాడుతూ రాణా వెల్ఫేర్ సొసైటీ జాతీయ అధ్యక్షులు సుంకర సాంబశివ రాయల్ స్ఫూర్తితో మొక్కలు నాటుతున్నట్లు ఆయన తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. రాణా వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి వాటిని సంరక్షిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రాణా వెల్ఫేర్ సొసైటీ ఏలూరు జిల్లా ఉపాధ్యక్షులు కొవ్వాడ విశ్వనాథాచారి తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలు అభినందనీయం

ప్రజాశక్తి - దెందులూరు

సమాజంలో సామాజిక స్పృహ పెంపొందిస్తూ ప్రతి మనిషి సాటి మనిషికి అండగా నిలిచేలా చేయడమే సిఎం చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన పి4 కార్యక్రమ లక్ష్యమని దెందులూరు ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్ తెలిపారు. పెదవేగి మండలంలోని మొండూరు గ్రామంలో బలుసు దీపు శ్రీనివాస్ పుట్టినరోజు వేడుకలను పేద ప్రజల ప్రయోజనార్థం మేలు కలిగించేలా నిర్వహించడం ఎంతో అభినందనీయమన్నారు. బలుసు లక్ష్మణ రమేష్, దివ్యశ్రీ దంపతులను ప్రత్యేకంగా అభినందిస్తున్నానని చెప్పారు. మొండూరు గ్రామంలో బలుసు దీపు శ్రీనివాస్ పుట్టినరోజును పురస్కరించుకుని గ్రామంలో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరం, రక్తదాన శిబిరాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా బాలుడు దీపు శ్రీనివాస్ తల్లిదండ్రులు బలుసు లక్ష్మణ రమేష్, దివ్యశ్రీ దంపతుల ఆధ్వర్యంలో సుమారు రూ.మూడు లక్షలు వెచ్చించి ఏర్పాటుచేసిన ఏడు రీఛార్జిబుల్ ట్రై సైకిళ్లను పంచాయతీ పరిధిలోని వికలాంగులకు అందించారు. అనంతరం ఎంఎల్‌ఎ ప్రభాకర్ కేక్ కటింగ్ కార్యక్రమాన్ని నిర్వహించి బాబుకు తినిపించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపరాఉ. మెగా ఉచిత వైద్య శిబిరంలో గ్రామానికి చెందిన వందలాది మంది ప్రజలు పాల్గొని ఉచిత వైద్య సేవలను అందుకున్నారు. ఆంధ్ర హాస్పిటల్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన జనరల్ ఓపీ విభాగంలో 387 మంది ఆరోగ్య చికిత్సలు చేయించుకోగా వారికి అవసరమైన మందులను ఉచితంగా అందించారు. డాక్టర్ నాదెళ్ల విష్ణువర్ధన్ ఆధ్వర్యంలోని శంకర్ నేత్ర చికిత్సాలయ ఆధ్వర్యంలో 94 మందికి ఉచిత కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా కళ్లద్దాలు అందించారు. సర్జరీ అవసరమైనవారికి ఈ నెలలో ఉచితంగా చేస్తారని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో దెందులూరు మార్కెట్ యార్డ్ కమిటీ ఛైర్మన్ గారపాటి రామసీత, టిడిపి పెదవేగి మండలాధ్యక్షులు ఈడుపుగంటి అనిల్, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

బస్సుల కోసం ఎదురుచూపు

నిరుపయోగంగా బస్టాండ్

ప్రయాణికుల అవస్థలు

నిరుపయోగంగా ఉన్న బస్టాండ్

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడి-ఏలూరు మధ్య ఎక్కువ మంది ప్రయాణిస్తూ ఉంటారు. చింతలపూడికి బస్సుల సంఖ్య తక్కువగా ఉండటంతో ఆర్‌టిసి అధికారులపై మండల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వస్తే వరుసగా మూడు నాలుగు బస్సులు ఒకేసారి వస్తున్నాయని, లేకపోతే గంటల తరబడి బస్సు కోసం ఎదురు చూడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బస్సు కోసం వేచి చూసేందుకు సరైన నీడ కూడా లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ప్రజలు వాపోతున్నారు. పాత బస్టాండ్ వద్ద రూ.లక్షలు పెట్టి నిర్మించిన బస్టాండ్ నిరుపయోగంగా మారిందన్నారు. అధికారులు పట్టించుకోవడంలేదని విమర్శలు చేస్తున్నారు. ఈ సమస్యలను నాయకులు చింతలపూడి ఎంఎల్‌ఎ సొంగా రోషన్‌కుమార్ దృష్టికి, కలెక్టర్ వెట్రిసెల్వి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని కోరుతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు బాధ్యత తీసుకొని బస్సుల సమయం మార్చేలా ప్రయత్నిస్తే బాగుంటుందని ప్రయాణికులు కోరుతున్నారు.

పని భారం తగ్గించాలి

అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్

ప్రజాశక్తి - చింతలపూడి

అంగన్వాడీ కార్యకర్తలపై యాప్‌ల పేరుతో విపరీతమైన పని భారం మోపుతున్నారని అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా గౌరవ అధ్యక్షురాలు కె.విజయలక్ష్మి అన్నారు. ప్రాజెక్ట్ మహాసభ సందర్భంగా ప్రతినిధులను ఉద్దేశించి ఆమె మాట్లాడారు. జిల్లా కమిటీ సభ్యురాలు బిజెఎస్.కుమారి మాట్లాడుతూ 2024లో రాష్ట్రవ్యాప్తంగా 42 రోజుల సమ్మె సందర్భంగా అంగన్వాడీ జెఎసికి ఇచ్చిన అనేక హామీలను నేటికీ నెరవేర్చలేదన్నారు. వెంటనే అంగన్వాడీలకు తెలంగాణ రాష్ట్రంలో వలే వేతనాలు పెంచి అంగీకరించిన వాటికి జిఒలు విడుదల చేయాలని కోరారు. మహాసభకు చింతలపూడి ఐసిడిఎస్ ప్రాజెక్ట్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు ఎన్.సరోజిని, మాణిక్యం అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు. సిఐటియు చింతలపూడి మండలాధ్యక్ష, కార్యదర్శులు నత్త వెంకటేశ్వరరావు, ఎం.బాలరాజు ప్రతినిధులను ఉద్దేశించి మాట్లాడారు. అనంతరం ప్రాజెక్ట్ యూనియన్ నూతన కమిటీని ప్రతినిధులు ఎన్నుకున్నారు. ప్రాజెక్ట్ యూనియన్ అధ్యక్షులుగా ఎన్.సరోజిని, కార్యదర్శిగా జి.సరళదేవి, కోశాధికారిగా బి.ఫణివర్ధిని, ఉపాధ్యక్షులుగా వి.ఈశ్వరి, సత్యవతి, సహాయ కార్యదర్శులుగా ఎం.అరుణకుమారి, నాగమణి, సెక్టార్ లీడర్లను ప్రాజెక్టు యూనియన్ కమిటీ మెంబర్లుగా త్రిఫ్ట్ సొసైటీ ప్రతినిధిగా కె.కవితను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మహాసభకు ప్రతినిధులుగా హేమలత, చెన్నకేశ్వరి, పాప రత్నం, పూజ దేవి, మరియమ్మ, ఝాన్సీ, బాబి నేతృత్వంలో ప్రతినిధులు హాజరయ్యారు.

ఉపాధ్యాయుల పోస్టులను భర్తీ చేయాలి

ప్రజాశక్తి - కుక్కునూరు

మాట్లాడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ నేత లెనిన్

ఖాళీగా ఉన్న ఉపాధ్యాయుల స్థానాలను వెంటనే భర్తీ చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ, సిపిఎం, సిపిఐ, వైసిపి, కాంగ్రెస్, సిఐటియు నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక సుందరయ్య భవనం ప్రజాసంఘాల కార్యాలయంలో ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో జిల్లా కార్యదర్శి కొలికపోగు లెనిన్ అధ్యక్షత జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో నాయకులు మాట్లాడారు. ప్రభుత్వం ఏజెన్సీ ప్రాంతం అంటే చిన్నచూపు చూస్తుందన్నారు. ప్రజలు గోదావరి వరదల్లో కొట్టుకుపోయినా పట్టించుకునే పరిస్థితి లేదన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభమై నేటికి 30 రోజులు గడుస్తున్నా ప్రభుత్వం మాత్రం ఏజెన్సీ ప్రాంత విద్యార్థులకు విద్యను అందని ద్రాక్షగా మారుస్తుందన్నారు. స్థానిక మండల, జిల్లా అధికారులు ఏజెన్సీ వైపు కనీసం కన్నెత్తి చూడటం లేదన్నారు. ఈ విధానం ప్రయివేట్ విద్యాసంస్థలను బలోపేతానికి కృషి చేసేలా ఉందన్నారు. కుక్కునూరు ఎంఇఒ బాబూరావు గత 11 ఏళ్ల నుంచి విధులు నిర్వహిస్తున్నా ఒక్క రోజు కూడా ప్రభుత్వ పాఠశాలల సందర్శన చేయలేదని, సమస్యలు పరిష్కరించలేదని చెప్పారు. ఖాళీ స్థానాల భర్తీ ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. మాట్లాడితే డిఎస్‌సి వంకా చూపడం సరికాదని, డిఎస్‌సి వచ్చేలోగా వేరే ప్రాంతాల నుంచి డిప్యుటేషన్ పద్ధతిలో చేయాలని, అలా కూడా వీలు కాకపోతే స్థానికంగా ఉన్న అర్హులైన నిరుద్యోగులతో విద్యా వాలంటీర్ల పోస్టులు భర్తీ చేసి విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఇవ్వాలని కోరారు ఈ నెల 16, 17 తేదీల్లో కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయుల పోస్టులు భర్తీ చేయాలని దీక్షలు నిర్వహిస్తామని, సమస్య పరిష్కరించకుండా ఉంటే పోరాటం ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. ఈ రౌండ్‌టేబుల్ సమావేశంలో సిపిఎం మండల జిల్లా కమిటీ సభ్యులు యర్రంశెట్టి నాగేంద్రరావు, సిపిఐ మండల కార్యదర్శి కొన్ని లక్ష్మయ్య, వైసిపి పోలవరం నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్ మల్లెల చంటి నాయుడు, సిఐటియు మండల కార్యదర్శి యర్నం సాయికిరణ్, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్డే రఘు, కాంగ్రెస్ మండల కార్యదర్శి గజ్జి రాజు పాల్గొన్నారు.

కోట శ్రీనివాసరావు మృతి తీరని లోటు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ఏలూరులో కోట శ్రీనివాసరావు (ఫైల్ ఫొటో)

తెలుగు సినీ పరిశ్రమలో దశబ్దాల పాటు ఎన్నో వైవిధ్య పాత్రలు పోషించి కోట్ల మంది అభిమానులను సంపాదించిన కోట శ్రీనివాసరావు లేని లోటు ఎవరూ తీర్చలేరని మంత్రి కొలుసు పార్థసారధి ఆదివారం ఓ ప్రకటలో పేర్కొన్నారు. వైవిధ్య భరితమైన నటనతో ప్రతి నాయకుడిగా, క్యారెక్టర్ ఆర్టిస్టుగా, కమెడియన్‌గా తెలుగు తెరపై ఎన్నో మరపురాని పాత్రలు పోషించిన గొప్ప నటుడు కోట శ్రీనివాసరావు మృతి సినీ పరిశ్రమలో తీరని లోటని తెలిపారు. వారి కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. గతంలో ఎన్నో కార్యక్రమాల్లో కోట శ్రీనివాసరావును కలిశానని, ఆయన స్నేహ శీలి, సేవా తత్వం, మంచి తనం ఉన్న మహా నటుడే కాకుండా గొప్ప మనసున్న మహానుభావుడని తెలిపారు.

ఏలూరు అర్బన్ :కళామతల్లి ముద్దుబిడ్డ కోట శ్రీనివాసరావు మృతి చలనచిత్ర పరిశ్రమకు తీరని లోటని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు, ఎఐటియుసి జిల్లా గౌరవాధ్యక్షులు కె.కృష్ణమాచార్యులు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చలనచిత్రాల్లో విభిన్న పాత్రలు పోషించి, ప్రేక్షకుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన కోట శ్రీనివాసరావు మరణం సినీ రంగంతో పాటు తెలుగు వారందరికీ బాధాకరమని తెలిపారు. నాలుగు దశాబ్దాలుగా నటుడిగా, క్యారెక్టర్ ఆర్టిస్టుగా, ప్రతి నాయకుడిగా కీర్తి గడిచారని స్మరించుకున్నారని పేర్కొన్నారు. శ్రీనివాసరావు ఏలూరు సర్ సిఆర్.రెడ్డి కళాశాలలో 1966 ప్రాంతంలో విద్యాభ్యాసం చేశారని, ఎన్‌సిసిలో ఫస్ట్ కంపెనీకి అండర్ ఆఫీసర్‌గా పనిచేశారని, కోట శ్రీనివాసరావు తొలి దినాల్లో ఏలూరుతో విడదీయరాని అనుబంధం ఉందనీ తెలిపారు.

ప్రముఖ సినీ నటులు, పద్మశ్రీ అవార్డు గ్రహీత కోట శ్రీనివాసరావు మృతి కళారంగానికి తీరని లోటని ప్రముఖ నాట్యాచార్యులు, కళారత్న కెవి.సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ భాషా చలన చిత్రాల్లో 700 పైగా విభిన్న పాత్రలు పోషించి, ప్రత్యేకత నిలుపుకున్న మహా కళాకారులు కోట శ్రీనివాస్‌ను గతంలో ఏలూరులో వైఎంహెచ్‌ఎ హాలులో సత్కరించినట్లు తెలిపారు. ఒక ఉత్తమ కళాకారుడిని కోల్పోవడం బాధాకరమని, వారి కుటుంబానికి ప్రగాఢ సంతాపం తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఘనంగా జెడ్‌పి చైర్‌పర్సన్ పద్మశ్రీ పుట్టినరోజు వేడుక

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

జెడ్‌పి చైర్‌పర్స్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎంపీ

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా చైర్‌పర్సన్ పద్మశ్రీ ప్రసాద్ పుట్టినరోజు వేడుకలను జిల్లా పరిషత్ గెస్ట్ హౌస్‌లో ఆదివారం ప్రముఖుల మధ్య ఘనంగా నిర్వహించారు. తొలుత కేక్ కటింగ్ నిర్వహించారు. ఎంపీ పుట్టా మహేష్‌కుమార్, ఏలూరు ఎంఎల్‌ఎ బడేటి రాధాకృష్ణయ్య, తాడేపల్లిగూడెం ఎంఎల్‌ఎ బొలిశెట్టి శ్రీనివాస్, గోపాలపురం ఎంఎల్‌ఎ మద్దిపాటి వెంకటరాజు, ఎపిఎస్‌ఆర్‌టిసి విజయవాడ రీజనల్ ఛైర్మన్ రెడ్డి అప్పలనాయుడు, రాష్ట్ర మహిళా సహకార ఆర్థిక సంస్థ ఛైర్మన్ పీతల సుజాత, టిడిపి నాయకుడు గంటా మురళి, జెడ్‌పిటిసిలందరూ జెడ్‌పి చైర్‌పర్సన్ పద్మశ్రీకి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

అత్యాధునిక అత్యుత్తమ ప్రమాణాలతో ఐటిఐ కోర్సులు

15 వరకు దరఖాస్తుల స్వీకరణ

స్పామ్ ఐటిఐ ప్రిన్సిపల్ సత్యనారాయణ

ప్రజాశక్తి - ముదినేపల్లి

ప్రస్తుత సమాజంలో ఆధునిక టెక్నాలజీ పరిజ్ఞానం ప్రతి విద్యార్థికీ కలిగి ఉండేలా గత ఎనిమిదేళ్ల నుంచి డిజిటల్ ఐటిఐను ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిర్వహిస్తున్నామని ముదినేపల్లి ఎస్‌పిఎఎం ఐటిఐ కళాశాల ప్రిన్సిపల్ కూనపరెడ్డి సత్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ ఉమ్మడి కృష్ణాజిల్లా ప్రస్తుతం ఏలూరు జిల్లాలోనే డిజిఇ అండ్ టి సెంట్రల్ గవర్నమెంట్‌చే ఉత్తమ గ్రేడింగ్ పొందిన సంస్థగా ఎస్‌పిఎఎం ఐటిఐను తీర్చిదిద్దామన్నారు. అత్యుత్తమ ప్రమాణాలతో డిజిటల్ వర్క్ షాపులు ఆధునిక సాంకేతిక పరికరాలతో శిక్షణ ఇస్తున్నామన్నారు. పదో తరగతి మార్కుల ఆధారంగా అడ్మిషన్లకు అవకాశం ఉండడంతో విద్యార్థులు ఇటువైపు ఎక్కువ మొగ్గు చూపుతున్నారన్నారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ఐటిఐలో రెండో విడత కౌన్సెలింగ్ ఈ నెల 15వ తేదీతో దరఖాస్తులు ప్రక్రియ ముగుస్తుందన్నారు. ఈ నెల 23వ తేదీతో అడ్మిషన్ల ప్రతిభ ఆధారంగా ప్రభుత్వం ఏర్పాటుచేసిన పరిశీలకులు వారిని ఎంపిక చేస్తారన్నారు. కృష్ణా, ఏలూరు గోదావరి జిల్లాల్లోని ప్రయివేట్ ఐటిఐల్లో దాదాపు 20 సంవత్సరాల అనుభవం కలిగిన అధ్యాపకులకు రాష్ట్రంలో అత్యధిక జీతాలు ఇస్తున్న ఐటిఐల్లో స్పామ్ ఐటిఐ ఒక్కటన్నారు. లాభనష్టాలతో సంబంధం లేకుండా ప్రతి ఏటా అధ్యాపకులకు ఇంక్రిమెంట్ ఇస్తున్నామన్నారు. స్పామ్ ఐటిఐను దేశంలో ఉన్న స్కిల్ ఇండియా ద్వారా నడుపుతున్నట్లు చెప్పారు. ఐటిఐలో ప్రవేశాలు పొందే విద్యార్థులు తమ తల్లిదండ్రులను వెంట తీసుకువచ్చి ఎక్విప్‌మెంట్ ఉన్నదీ లేనిదీ పరిశీలించి వివరాలు తెలుసుకోవచ్చన్నారు. ప్రతి విద్యార్థికి కంప్యూటర్ పరిజ్ఞానం కలిగించాలనే ఉద్దేశంతో సరికొత్త కంప్యూటర్లతో శిక్షణ ఇస్తున్నామన్నారు. కంప్యూటర్ బేసిక్ టెస్ట్, ఆన్‌లైన్ పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. డీజిల్ మెకానిక్, ఎలక్ట్రీషియన్, పిట్టర్ ట్రేడుల్లో శిక్షణా తరగతులకు అత్యాధునిక నైపుణ్యం కలిగిన అధ్యాపకులు, అధ్యాపకురాలతో మెరుగైన శిక్షణ ఇస్తున్నామన్నారు. షెడ్యూల్ తరగతులకు సంబంధించిన విద్యార్థులు కృష్ణా, ఉభయగోదావరి జిల్లాల నుంచి ఎక్కువ మంది వచ్చి స్పామ్ ఐటిఐలో విద్యనభ్యసిస్తున్నారన్నారు. ఇప్పటికే దరఖాస్తుల ఆధారంగా స్పామ్ ఐటిఐలో ఎలక్ట్రీషియన్, ఫిట్టర్ ట్రేడ్ కోర్సులు సీట్ల భర్తీ పూర్తయిందన్నారు. ఇంకా డీజిల్ మెకానిక్ సీట్లు కొద్ది మేర భర్తీ కావాల్సి ఉందన్నారు. ఎనిమిది యూనిట్లు ఉన్నాయన్నారు. ఒక్క యూనిట్‌కు 20మంది విద్యార్థులు, మొత్తం 160 మందికి ప్రవేశం ఉందన్నారు. పదో తరగతి ఉత్తీర్ణత అయిన వెంటనే ఎస్‌సి, ఎస్‌టి, బిసి, ఒసి పేద, మధ్యతరగతి విద్యార్థులు ఏ విధమైన అధిక ఫీజులు లేకుండా కేవలం ప్రభుత్వం వారి నిర్ణయించిన ఫీజు ప్రకారం ప్రభుత్వ ఫీజు రీయంబర్స్‌మెంట్ ద్వారా ఉచిత శిక్షణ పొందవచ్చన్నారు. రాయితీతో కూడిన బస్సు పాస్, ట్రైన్ పాస్ కలవన్నారు. దూరపు విద్యార్థులకు ప్రభుత్వ హాస్టల్‌లో ఉచిత భోజనం, వసతి కల్పిస్తామన్నారు. ఈ సదవకాశాన్ని కృష్ణా, పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపల్ సత్యనారాయణ కోరారు. వివరాలకు 9849655419 సంప్రదించాలని తెలిపారు.

నేడు మెగా జాబ్‌మేళా

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పన కోసం ఎంపీ పుట్టా మహేష్ కుమార్ విశిష్ట కృషి చేస్తున్నారని టిడిపి కొయ్యలగూడెం మండలాధ్యక్షులు పారేపల్లి నరేష్ తెలిపారు. ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ ఆధ్వర్యంలో ఈ నెల 14వ తేదీన ఏలూరులోని సిఆర్ రెడ్డి ఇంజినీరింగ్ కళాశాల ఆవరణలో ఉదయం 9:30 గంటల నుంచి మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మెగా జాబ్ మేళాలో 39కి పైగా ప్రముఖ సంస్థలు పాల్గొంటున్నాయన్నారు. దాదాపు మూడు వేల ఉద్యోగ అవకాశాలను కల్పించే లక్ష్యంతో ఈ కార్యక్రమం జరుగుతుందని ఆయన వెల్లడించారు. మండలంలోని నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పారేపల్లి నరేష్ కోరారు. వివరాల కోసం 9493482414, 8978524022, 8143549464 సంప్రదించలని కోరారు.

ప్రకటన

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) కోర్టు, నరసాపురం

I.A.No. 447/2021 in O.S.No. 359/2021

Between:

గొల్లమండల సునీత ...పిటిషనరు

మరియు

మైలాబత్తుల దైవ ఆశీర్వాదం వగైరాలు ...రెస్పాండెంట్స్

"సాధారణ పద్ధతిలో ఈ క్రింది వారైన మీకు నోటీసులు అమలు కానందున శ్రీయుత కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం పత్రికా ప్రకటన ద్వారా 2వ రెస్పాండెంట్‌కి ప్రత్యామ్నాయ పద్ధతిలో నోటీసు జారీ"

రెస్పాండెంట్-2:

పాలపర్తి కాంచన, W/o. లక్ష్మీనారాయణ,
D.No. 15-3-3-5, పాలపర్తి వారి వీధి,
నరసాపురం, పశ్చిమ గోదావరి జిల్లా.

పై పిటిషనులో Not to Further alienate the petition Schedule Property పరిహారం నిమిత్తం మీపై మరియు మరికొంత మందిపై I.A. దాఖలు వేసి యుండుట వలన **ది. 11-08-2025 వ సం॥రం తేదీన ఉదయం గం. 10-30 ని॥లకు** స్వతహాగా కాని, ప్లీడరు ద్వారా కాని పై కోర్టు యందు హాజరు కాగలరు. లేనిచో మీ పరోక్షమందు సదరు పిటీషన్‌ను తీర్మాణం చేయబడును.

అమరేశ్వరరావు కె.
నరసాపురం అడ్వకేట్, నరసాపురం
ది.13-07-2025 సెల్: 90637 77879

ప్రకటన

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) కోర్టు, నరసాపురం

O.S.No. 359/2021

Between:

గొల్లమండల సునీత ...వాది

మరియు

మైలాబత్తుల దైవ ఆశీర్వాదం వగైరాలు ...ప్రతివాది

"సాధారణ పద్ధతిలో ఈ క్రింది వారైన మీకు సమన్లు అమలు కానందున శ్రీయుత కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం పత్రికా ప్రకటన ద్వారా 2వ ప్రతివాదికి ప్రత్యామ్నాయ పద్ధతిలో సమన్లు జారీ"

ప్రతివాది-2:

పాలపర్తి కాంచన, W/o. లక్ష్మీనారాయణ,
D.No. 15-3-3-5, పాలపర్తి వారి వీధి,
నరసాపురం, పశ్చిమ గోదావరి జిల్లా.

పై దావాలో Specific performance పరిహారం నిమిత్తం మీపై మరియు మరికొంత మందిపై దావా వేసి యుండుట వలన **ది. 11-08-2025 వ సం॥రం తేదీన ఉదయం గం. 10-30 ని॥లకు** స్వతహాగా కాని, ప్లీడరు ద్వారా కాని పై కోర్టు యందు హాజరు కాగలరు. లేనిచో మీ పరోక్షమందు సదరు వ్యాజ్యమును తీర్మాణం చేయబడును.

అమరేశ్వరరావు కె.
నరసాపురం అడ్వకేట్, నరసాపురం
ది.13-07-2025 సెల్: 90637 77879

ప్రకటన

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) పాలకొల్లు వారి కోర్టులో

O.S.N. 158/2024

Between:

మల్లుల నాగమల్లేశ్వరరావు ...వాది

మరియు

గోడి రాజ్‌కుమార్ ...ప్రతివాది

గోడి రాజ్‌కుమార్, తండ్రి: రామరాజు, D.No. 25-11-15/1, శంభుని పేట,పాలకొల్లు, ప॥గో॥జిల్లా, PJCJC

పై నెంబరు దావాలో ప్రతివాదికి శ్రీ కోర్టు వారి ఆదేశానుసారం సమన్లు శ్రీ కోర్టు వారి ద్వారా మరియు రిజిష్టరు పోస్టు ద్వారా జారీచేయగా ప్రతివాది ఉద్దేశ్యపూర్వకంగా తీసుకొననందున శ్రీ కోర్టు వారు ఈ పత్రికాభిముఖంగా సమన్లు జారీ ఉత్తర్వులు జారీ చేసియున్నారు. కావున ప్రతివాది **ది. 31-07-2025 వ సం॥రం తేదీన ఉదయం గం. 10-30 ని॥లకు** శ్రీ కోర్టు వారి ఎదుట వ్యక్తిగతంగా కాని, న్యాయవాది ద్వారా గాని హాజరై ఆక్షేపణలు తెలియపర్చుకొనవలెను. లేని ఎడల సదరు గ్రంథం మీ పరోక్షమున తీర్మానించబడునని తెలియచేయడమైనది.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

బొంతు నాగభూషణరావు (గాంధీ)
బొంతు ప్రతిభ
పాలకొల్లు అడ్వకేట్స్
ది.12-07-2025 పాలకొల్లు - 534260
ఫోన్: 226656 సెల్: 98495 92095

ప్రకటన

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో

E.P.No. 13/2024 in O.S.No. 214/2016

Between:

రేగాని సూర్యకాంతం ...D.H.R

అండ్

సమయం లక్ష్మి others ...J.D.Rs

To. 2nd JDr:
Samayam Srinivas,
S/o. Kanta Rao, D.No. 13-9-10/4
Rama Chandra Rao Peta,
Tadepalligudem, TPGSCJC

పై నెంబరు E.P. లో 2వ JDr కు ఎన్నిసార్లు నోటీసులు పంపినను E.P. సంగతులు తెలిసి యుండి సదరు నోటీసులు తీసుకోనకుండా evade చేయుచున్నందున Substitute Service ద్వారా అమలు జరుపుటకు ఉత్తర్వులు ఇచ్చి **ది. 23-07-2025 వ సం॥రం తేదికి** వాయిదా వేసియున్నారు. కావున మీరు సదరు వాయిదా రోజున **ఉదయం గం. 10-30 ని॥లకు** పై కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేని యెడల మీ పరోక్షమందు పై నెంబర్ E.P. తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

పసుపులేటి శ్రీనివాస్
తాడేపల్లిగూడెం అడ్వకేట్ ఫర్ Dhr
ది.10-07-2025 తాడేపల్లిగూడెం